# మరణదేవత

శ్రీ తిరుమల వెంకటేశ్వర్లు

అది పెద్దనగరం. దానికి బయట పెద్ద రాజబాట. బాటకిరువైపుల చింతచెట్ల వరుసలు. కాని ఆశ్చర్యం! – ప్రతిరోజూ ఆ బాటన పదిపన్నెండు మంది బాటసారులు చనిపోతుంటారు. ఒకరిని తేలు కరిచి, మరొకరిని పాముకరిచి రకరకములుగా మృత్యుదేవతకాహుతి యగుతుంటారు. అందువలన ప్రజలు ఆబాటన ప్రయాణం చేయడం చాల అరుదైపోయింది.

రామయ్య ఆనగరవాసి. వయస్సు ముప్పై ఏళ్లుంటవి. అతడు ఆ బాటన బయలుదేరి వెళ్తుండగా ఒకరోజున నొక మండ్రగబ్బ కనుపించింది. రామయ్య చూస్తుండగానే అదిపాముగామారి ముందు నడుస్తున్న బాటసారిని కరువగా నతడు నురుగులు క్రక్కుతూ క్రిందపడి ప్రాణాలు వదిలాడు. రామయ్య ఆశ్చర్యంతో ఆ పామును వెంబడించి అలాగమరి కొంత దూరం వెళ్లాడు. పాము తిన్నగావెళ్లి రాజప్రాసాదంలో ప్రవేశించింది. మరొక క్షణంలో ఆనగరాధిశుని మరణవార్త వినవచ్చింది.

మరునాడు రామయ్య ఆయూరి ప్రక్కనే పారుతున్న కాలువగట్టుకు వెళ్ళాడు. అంతకుముందు తానుచూచిన పాము చెట్లబాటున కనుపించింది. మరొక నిముషంలో నది దున్నపోతుగా మారింది. అక్కడ కాలువదాటుటకని ముగ్గురు కుర్రాళ్లు ప్రయత్నిస్తున్నారు. ఎంతసేపటికి పడవరాకపోవడంవలన వాళ్లలో ఆదుర్దా ఎక్కువయింది. చివరకు నీళ్లలోదిగబోతున్న దున్నపోతును చూచి దాని సహాయంతో కాలువదాట నుద్దేశించి యిద్దరు దానిమీద నెక్కి, ఒకడు తోకపట్టుకున్నాడు. దున్నపోతు కాలువలో దిగింది. సగం దూరంపోయి అమాంతంగా దున్నపోతు, దానితోబాటు ముగ్గురు కుర్రాళ్లు మునిగిపోయారు. కొంచెము సేపటికి దున్న మాత్రము ఒడ్డుకుచేరింది.

చూస్తూ యుండగానే దున్నపోతు ఒక చక్కని యువతిగా మారింది. ఇంతలో యిద్దరు యువకులు ఆదారిన వచ్చారు. అందులో నొకడు ఆయువతిని ''ఎవరు నీవు? ఇచ్చట ఎందుకున్నావు?'' అని అడిగాడు. ఆమె ''నేను పరదేశిని; నాకెవరులేరు''

అన్నది "అయితే నన్ను పెళ్లిచేసికుంటావా" అని అడిగాడు.

ఆమె "అలాగే - కాని నాకుచాల ఆకలిగానున్నది. ఏదైనా కొంచెము తినడానికి తెచ్చిపెట్టు" అన్నది. సరేనని మరొకనిని ఆమె దగ్గరనే యుండమని తానేదైనా తినడానికి తేవడానికి వెళ్లాడు.

అతడు వెళ్లగానే ఆయువతి అచ్చటనున్న యువకునితో "అతడు నాకేం నచ్చలేదు. నేను నిన్ను ప్రేమిస్తున్నాను. అతడు రాకముందే మనమిద్దరం యిచటనుండి పారి పోదాం" అన్నది.

కాని అతడు వప్పుకోక తనస్నేహితుడికి ద్రోహం చెయ్యలేనని ఖచ్చితంగా చెప్పాడు. ఆమెకు కోపంవచ్చింది. తిను బండారాలకొరకు పోయిన యువకుడు రాగానే ఏడుస్తూ అతని స్నేహితుడు తన్ను బలవంతంచేశాడని చెప్పింది. యువకులిద్దరు వరలనుండి కత్తులు దూసి హోరా హోరీగా పోరాడి ఒకరి నొకరు పొడుచుకొని చచ్చిపోయారు.

ఇదంతా చూస్తున్న రామయ్య విస్తుబోయాడు [illegible]యి ఎవరో-అనేక రూపాలెత్తిడమేమిటో తెలిసికోవాలనే ఆసక్తి అధికమయింది. రామయ్య గబగబ ఆ యువతిని సమీపించి "నీవు ఎవరు తల్లీ! యింతమందిని చంపుతున్నావు" అని అడిగాడు

ఆ యువతి చిరునవ్వుతో "నేను మృత్యుదేవతను" అన్నది.

"మరినన్నెందుకు చంపలేదు"

"నీ జీవితానికింకా. అంత్యకాలం రాలేదు. ఇంకా యిరవై సంవత్సరాలు గడిచాక నిన్ను ఆహ్వానిస్తాను" అంటూ పక్షిగామారి ఆకాశమార్గాన ఎగిరి పోయింది.

---

## ప్రయాణీకుల సౌకర్యాలు

రైల్వే ప్రయాణీకులకు కనీస సౌకర్యాలు కల్పించడానికి, వారికి ఏ విధమైన లోటు రాకుండా చూడడానికి ప్రతి రైల్వేకి ఒక స్పెషల్ ఆఫీసరుని నియమించడానికి రైల్వేబోర్డు నిర్ణయించింది. ఆ స్పెషలు ఆఫీసర్లు జనరలు మానేజర్ల అధికారానికి లోబడి పనిచేస్తారు. 1954-55-వ సంవత్సరంలో ప్రయాణీకులకు సౌకర్యాలు కల్పించే నిమిత్తం 3 కోట్ల రూపాయలు కేటాయించబడ్డాయి. రైల్వే ప్రయాణీకుల సౌకర్యాల కల్పనకు పంచవర్ష ప్రణాళిక క్రింద 15 కోట్ల రూపాయిలు వ్యయపరచబడనున్నాయి.

భారత ప్రభుత్వ సమాచారశాఖ